క్లుప్తంగా

హక్కుల సాధనకు పోరాడాలి



ఈత మొక్కలు నాటుతున్న గౌడ సంఘం నాయకులు

మర్కూక్(గజ్వేల్): హక్కుల సాధనకు గౌడ సంఘం నాయకులు పోరాడాలని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు పూదారి రాజు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని మర్కూక్‌లో ఈత మొక్కలు నాటారు. అంతకు ముందు పాములపర్తి ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు ఏ రాజకీయ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక్క సీటు కేటాయించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిగౌడ్, సర్పంచ్ భాస్కర్, ఆత్మకమిటీ కమిటీ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, మర్కూక్ మాజీ సర్పంచ్ మల్లేష్ గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ కోరారు. శనివారం మండల పరిధిలోని గంగాపూర్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావును మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకుని సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు వేణు, రామాగౌడ్, అశోక్ రెడ్డి, సాయిలు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోండి’




సిద్దిపేట రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటజోన్: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న రాములుపై చర్యలు తీసుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రమేష్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికలు దండగ అని గోడల మీద రాతలు రాయించిన ఆయన మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, రషీద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పంట ధ్వంసంపై ఫిర్యాదు

హుస్నాబాద్: కేసీఆర్ సభ కోసం అనుమతి లేకుండా పంటలను ధ్వంసం చేశారని, వెంటనే సభను రద్దు చేయాలని శనివారం కలెక్టర్, ఆర్డీఓ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు రైతు ఎనగందుల లక్ష్మీనారాయణ తెలిపారు. నువ్వుల పంటను తనకు తెలియకుండా పూర్తిగా ధ్వంసం చేశారని వాపోయారు. వెంటనే సభను రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతు చెప్పారు. నష్టపరిహారం ఇచ్చి రైతును ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో కలెక్టర్‌ను కోరారు.

‘పల్లా’కే మా మద్దతు



తీర్మాన పత్రాలను అందజేస్తున్న కులసంఘాల పెద్దలు

మద్దూరు(హుస్నాబాద్): రాబోయే ఎన్నికల్లో మా మద్దతు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికే ఇస్తున్నట్లు మండలంలోని రేబర్తికి చెందిన వివిధ కుల సంఘాల పెద్దలు తీర్మానాలు చే శారు. శనివారం బీఆర్‌ఎస్ సీనియర్ నా యకుడు నాంపల్లి చంద్రశేఖర్‌కు తీర్మాన పత్రాలను అందజేశారు. పల్లాను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. కాగా జనగామలో జరిగే బహిరంగ సభకు బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని చంద్రశేఖర్ కోరారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

జిల్లావ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం సంప్రదాయ దుస్తుల్లో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, చెరువుల వద్దకు చేరారు. కోలాటాలు, పాటలతో అలరించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



హుస్నాబాద్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చేర్యాల: శ్రీనగర్‌లో..



అక్కన్నపేట మండలకేంద్రంలో..



నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): పెద్దకోడూరులో..



సిద్దిపేటలో బతుకమ్మ సంబరాలు



గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లోని బీడీ కాలనీలో..



హుస్నాబాద్: పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొమురవెల్లి: మల్లన్న ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోహెడలో బతుకమ్మలతో చిన్నారులు

దుబ్బాక గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా అని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చేగుంట, మిరుదొడ్డి, దుబ్బాక, తొగుట మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపఎన్నికల్లో ప్రజలను నమ్మించి గెలిచిన రఘునందన్‌రావు మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి కొత్త డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. కేవలం వెయ్యి ఓట్లతో గెలిచిన రఘునందన్‌రావును ప్రస్తుతం ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నియోజకవర్గంలో వివిధ పార్టీల విధానాలు నచ్చకనే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

సభకు 20వేల మందిని తరలిస్తాం



మాట్లాడుతున్న ఎడ్ల సోమిరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. గత కాంగ్రెస్, బీజేపీలు తండాలు, గిరిజనులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నేడు హుస్నాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు తరలి వచ్చేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. అక్కన్నపేట మండలం నుంచి 20 వేల మందిని తరలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు బీలునాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు లింగాల సాయిన్న, అశోక్‌బాబు, చౌటపల్లి సర్పంచ్ గద్దల రమేష్, నాయకులు పర్శరాములు, శ్రీనివాస్, తిరుపతినాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దుబ్బాక: దుబ్బాక అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావును విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిజమైన లబ్ధిదారులకు కాకుండా కేవలం కొంతమందికి మాత్రమే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, నాయకులు షాదుల్, స్వామి, రమణారెడ్డి, రమేష్ రెడ్డి, బాబు, ప్రవీణ్ కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ద్రోహి రఘునందన్‌రావు



దుబ్బాక: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక/మిరుదొడ్డి/తొగుట,దౌల్తాబాద్: సీఎం కేసీఆర్ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని దళితబంధు, బీసీ బంధు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరవద్దనే కుట్రతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు పథకాలు నిలిపివేయాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమని బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్, జిల్లా అధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి మండిపడ్డారు. శనివారం దుబ్బాక ఎంపీ క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. తప్పుడు ప్రచారాలతో ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావు మరోసారి తన నిజ స్వరూపం బయట పెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు స్వామి, కనకయ్య, బాలకృష్ణ గౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ యూత్ అధ్యక్షుడు భూపాల్, సీనియర్ నాయకులు రాజమౌళి, భూంరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలో ఎంపీపీ గజ్జెల సాయిలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజావ్యతిరేకిగా మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చేయం.. ఇతరులను చేయనివ్వం అన్న చందంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని తొగుట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. దౌల్తాబాద్‌లో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు కొమ్మెర పూజిత, ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డారు.

దరఖాస్తుల స్వీకరణ

చేర్యాల(సిద్దిపేట): విశ్వకర్మ యోజన పథకం నమోదు కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని చుంచనకోటలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పథకం ద్వారా 18 బీసీ కులాలకు చెందిన వారికి రూ. 3 లక్షల వరకు రుణం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ సంజీవులు, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వడ్లకొండ వెంకటేష్, నాయకులు రాందాసు, మనోజ్, రామకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెల పంపిణీ ఎప్పుడూ?

హుస్నాబాద్‌రూరల్: సబ్సిడీ గొర్రెలను అక్టోబర్ చివరి వరకు పంపిణీ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని తెలంగాణ ఉద్యమ నాయకుడు మేకల వీరన్నయాదవ్ ప్రశ్నించారు. శనివారం హుస్నాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు డీడీలు తీసి 5 నెలల నుంచి ఎదురు చూస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా గొర్రెలను అందించాలని డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు 50 ఏళ్లకే పింఛన్, రూ. 10 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు వేదరబోయిన వేణు, వల్లపు రాజు, కొమురెల్లి, కాశబోయిన సంపత్, చౌదరి అశోక్, గొర్ల అజయ్, గొర్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు



ఏకగ్రీవ తీర్మాన ప్రతిని అందజేస్తున్న విశ్వ బ్రాహ్మణులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం చిన్నకోడూరులో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేటలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు హరీశ్‌రావుకు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శారద రమేష్, శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంత్. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న బొమ్మ శ్రీరాం చక్రవర్తి

హుస్నాబాద్: గౌరవెల్లి భూ నిర్వాసితులు, ప్రతిపక్ష నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ప్రభుత్వం ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి, గౌరవెల్లిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. హుస్నాబాద్‌ను అభివృద్ధి చేస్తే సెంట్‌మెంట్‌కు విఘాతం కలుగుతుందని వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. గృహలక్ష్మి, బీసీ బంధు బీఆర్‌ఎస్ కార్యకర్తలే పంచుకున్నారని ఆరోపించారు. మొట్ట మొదట ఓడిపోయేది సతీష్ కుమారే అని అన్నారు. కేసులను విత్‌డ్రా చేసుకుంటామని వేదిక నుంచి ప్రకటించకుంటే బహిరంగ సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, కౌన్సిలర్ స్వర్ణలత, నాయకులు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లేశం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏబీవీపీ నూతన కమిటీ

దుబ్బాక: ఏబీవీపీ దుబ్బాక ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంఘటన కార్యదర్శి లక్ష్మీపతి, జిల్లా కన్వీనర్ వివేక్ హాజరై నూతన దుబ్బాక నగర కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ప్రభాస్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, అజయ్, తదితరును ఎన్నుకున్నారు.

దంపతుల ఔదార్యం



వర్గల్(గజ్వేల్): దసరా పర్వదినం పురస్కరించుకుని వర్గల్‌కు చెందిన రైతు దంపతులు వేలూరి దివ్య, కృష్ణారెడ్డి దంపతులు శనివారం 150 మంది పేదలకు భోజనం పెట్టి దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తుంటామని వారు తెలిపారు.

నూతన నియామకాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిప్పరవేని బాబును నియమిస్తున్నట్లు శనివారం గుగ్గిల్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే బెజ్జంకి, మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన పులి సంతోష్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు చెప్పారు.

ప్రవళికది ప్రభుత్వ హత్యే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/ చిన్నకోడూరు: నిరుద్యోగ విద్యార్థిని ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరవింద్, ప్రశాంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని ప్రవళికది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ పేర్కొన్నారు. యువత ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు.

గ్రామాభివృద్ధిపై అసత్య ఆరోపణలు

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తే కోనాపూర్ సర్పంచ్ స్వామి పనులు చేయలేక బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చిటుకుల స్వామి మండిపడ్డారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కేటాయించాలని దరఖాస్తు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కరీంనగర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించినట్లు చెప్పారు.

నివాళి

కోహెడ(హుస్నాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులు, యువత కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు దబ్బెడ యాదయ్య అన్నారు. శనివారం అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రవళికకు ని వాళి అర్పించారు. తిరుపతి, శ్రీనివాస్, మహేష్, అశోక్, నరేష్‌బాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

‘దళితబంధు’ను అడ్డుకోవడం సరికాదు

సిద్దిపేటకమాన్: దళితుల అభ్యున్నతి, ఆర్థిక ఎదుగుదల కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అమలుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అడ్డుపడడం సరికాదని డీడబ్ల్యూజేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజలింగం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జనార్దన్, కోశాధికారి చంద్రం, బాబురావు, రంగరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

అన్నదానం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాశీ అన్నపూర్ణ అన్నదాన సంఘం ద్వారా ప్రతి నెల అమావాస్య రోజున అన్నదానం నిర్వహించేలా తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం స్థానిక వైశ్యభవన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధిలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పాండురంగం, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామలో ఈనెల 16న తలపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మండలవ్యాప్తంగా కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు స్వామి, కరుణాకర్, నాయకులు మెరుగు శ్రీనివాస్, బచ్చల సాయి మల్లు, ముత్యం నర్సింహులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడికి గాయాలు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కూటిగల్‌లో శనివారం బతుకమ్మ పండగ సందర్భంగా విద్యుత్ స్తంభానికి బల్బులు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి పంచాయతీ కార్మికుడు పాకాల యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.